
మినీకథ



# సినిమా సరదా

జయంతి నాగరాణి

మా పెళ్ళయిన మొదటి వారంలో; ఊళ్ళోనే అత్తవారిల్లు. అత్తగారు లేరను కోండి. మామగారున్నారు. మా ఆయన ఇక్కడికి దగ్గర్లో ఉన్న పల్లెటూర్లో వ్యవసాయం చేయిస్తున్నారు. మా బావ గార్లు ఆడపడుచులు (పెద్దవాళ్ళు) వేరే వేరే ఊర్లలో ఉద్యోగ రీత్యా ఉంటున్నారు. మా పెద్దాడపడుచు కూతురు కొడుకు ఇక్కడే మా మామగారి దగ్గర ఉండి చదువుకుంటున్నారు.

మా ఇంట్లో మావారి చిన్నప్పటి నుండి ఈ ఇంట్లో ఒకావిడ ఉంటున్నారు. ఆవిడ చాలా ఒపికస్తురాలు వీళ్ళందర్ని పెంచి పెద్ద చేసి పెళ్ళిళ్ళు పేరంటాలు ఆవిడ చేతి మీదుగానే జరిగాయి. ఇంటి పెత్తనమంతా ఆవిడదే. ఆవిడ ఇంటెడు చాకిరి చిటికెలో చేసి చాలా సరదాగా ఉండే వాళ్ళు. మా ఇంట్లో ఎప్పటి నుండో 10 గం.లకే ఉదయం భోజనాలు పండుగవని ఏమైనా అవని. మా మేనల్లుడు భోజనాలవగానే అత్తా సినిమాకి మార్నింగ్ షోకి తీసికెళ్తవా? అన్నాడు. గుండెల్లో రాయి పడింది. వాళ్ళకి నేను కొత్త కాదు! లేవంటే ఏమనుకుంటారో? అందుకని మెల్లిగా తన బ్యాగ్ వెతికాను. 2 ఐదు రూపాయిల నోట్లు కనిపించాయి. ప్రాణం లేచి వచ్చింది. వెంటనే 'సరే' అన్నాను. దాంతో చకచక ఆవిడతో సహా నలుగురం తయారయ్యాం. సినిమా హాలు దగ్గిరే. నడిచి వెళ్ళాం.

ఆవిడకు సినిమాలంటే చాలా సరదా! ఏముంది హాలు కెళ్ళి కౌంటర్లో చేయి పెట్టి నాలుగు టిక్కెట్లన్నాను. 'ఈ నోట్లు చెల్లవండి' అన్నాడు టిక్కెట్లతను. అంతే గతుక్కుమన్నాను. ఆవిడతో ఆ సంగతి చెప్పాను. పాపం ఆవిడ చాలా నిరుత్సాహపడి వెంటనే మా మేనల్లుడితో 'ఒరే ఇంటికెళ్ళి తాత నడిగి డబ్బు తీసుకురా' అన్నారు. మరి సినిమా అంటే ఉత్సాహం కదా! ఆ అబ్బాయి వెంటనే పరిగెట్టి మామగార్నడిగి డబ్బు తెచ్చాడు. టికెట్టుకొని సినిమా కెళ్ళిపోయాం. సినిమా చూసి నంత సేపు బెంగ గుర్తులేదు. కాని ఇంటికి రాగానే ప్రారంభమైంది గుండెల్లో దడ. మా ఆయనొచ్చి ఏమంటారో మా మామ గారు తనకు ఏం చెబుతారో! సాయంత్రానికి తనొచ్చారు. రాగానే వాళ్ళ నాన్నగారి గదిలో కెళ్ళారు. ఏముంది నాకు వణుకు. మా మామగారు తనతో 'ఒరే మీ ఆవిడ నాకు చెల్లని నోట్లిచ్చి డబ్బు పుచ్చుకొని సినిమా కెళ్ళిందిరా' అన్నారు. బాబోయ్ అనుకొని గదిలో కెళ్ళి పోయాను. తను చాలా నెమ్మదిగానేనాతో 'పొద్దుట నేను వెళ్ళేటప్పుడు నన్ను డబ్బుడిగితే ఇచ్చే వాణ్ణే కదా! ఆ చెల్లని నోట్లన్నీ ఒకసారి జమ అయ్యాక బాంక్‌లో ఇచ్చేద్దామని పెట్టాను అన్నారు. మా వారు చాలా నెమ్మదస్తులు. మెల్లిగా మాట్లాడే రకం. అప్పుడు నా గొంతు చాలా మెల్లిగానే ఉండేదనుకోండి. ఇప్పుడు పిల్లలు పుట్టాక వాళ్ళతో అరచి గొంతు పెద్దదైంది. అప్పుడు నేను అంత కన్నా మెల్లిగా జరిగిందంతా చెప్పి 'ఇంట్లో నోట్లు విప్పి చూసుకోలేదండి' అన్నాను. కాని తను నాకు సినిమాల వెర్రి అని ఏమనుకుంటారోనని చచ్చేటంత భయం వేసింది. కాని ఇప్పుడు తలచుకుంటే అంత చిన్న విషయాని కెందుకంత భయపడ్డాననిపిస్తుంది. ఇప్పటికీ మా మేనకోడలు, అల్లుడు సినిమా కన్నా సినిమా గురించి పడ్డా పాట్లు మరిచి పోలేని వంటూ ఉంటారు. సినిమా చూడకుండా ఇంటికి రావలసి వస్తుందేమోనని ఎవరికి వాళ్ళకే మనస్సుల్లో దిగులుగా ఉండిందా రోజు. ●